# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

మంగళవారం 21 ఏప్రిల్ 2026


## శ్రీటౌన్ పోలీసులు జాగిలంతో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్ స్టాండ్‌లలో ఆకస్మిక తనిఖీలు



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్ స్టాండ్‌లలో త్రీటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు జాగిలంతో సర్ప్రైజ్ చెకింగ్‌లు చేపట్టారు. గంజాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జిల్లాలో గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో ఇతర రాష్ట్రాలు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే రైళ్లు, బస్సులు, పార్సిల్ సర్వీసులపై విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ పర్యవేక్షణలో ఎస్ ఐ నరసింహ ఆధ్వర్యంలో సిబ్బంది సమన్వయంతో తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్స్ డిటెక్షన్ జాగిలం టైగర్ సహకారంతో తనిఖీలు మరింత సమర్థవంతంగా కొనసాగించారు. స్థానిక రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, పార్సిల్ కార్యాలయాల్లో సర్ప్రైజ్ చెకింగ్‌లు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుండి అనంతపురం మీదుగా వెళ్తున్న రైళ్లలో ప్రయాణీకులకు ఇబ్బంది కల్గకుండా చెక్ చేశారు. ఈ తనిఖీలలో అనుమానాస్పద వ్యక్తులు, అనుమానాస్పద లగేజీ బ్యాగులు, తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశీలించారు. ప్రజలు కూడా గంజాయి, తదితర మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని, ఎవరైనా మాదక ద్రవ్యాల సంబంధిత సమాచారం గమనించిన పక్షంలో వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా అత్యవసర సేవల నెంబర్ 112 కు సమాచారం అందించాలని ప్రయాణికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అనంతపురం ఐసీడీఎస్ పీడీగా శశికళ

### పాత పీడీ ఎం.శ్రీదేవి నుంచి ఛార్జ్ తీసుకున్న శశికళ



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం ఐసీడీఎస్ పీడీగా శశికళ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటి సీడీపీఓగా పని చేస్తున్న శశికళను అనంతపురం ఇంచార్జ్ పీడీగా నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు అనంతపురం పీడీగా పని పనిచేస్తున్న ఎం.శ్రీదేవి కడప జిల్లా బద్వేలు సీడీపీఓగా కొనసాగనున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన శశికళ శ్రీదేవి నుంచి చార్జ్ తీసుకున్నారు. అంతకు ముందు సీనియర్ అసిస్టెంట్ బాబా నూరుద్దీన్, ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఖాజీ రఫీ మున్నీసా, డీఈఓ గీత, సిబ్బంది హరి, మసూద్ బాషా, ఎం.ఎస్.కేలు హేమ, లక్ష్మీదేవి, సైరా బాను కొత్త పీడీ శశికళకు స్వాగతం పలికారు. కొత్తగా వచ్చిన పిడి ఆఫీస్ సిబ్బందితో కలిసి కొంతసేపు కలయ తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## చంద్రబాబు నాయుడుకు అన్న క్యాంటీన్లో ఘనంగా జన్మదిన వేడుకలు



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అనంతపురం నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్



శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలు, కార్మికులు, విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు జరుపుకొని కేక్ కట్ చేసి వారికి పంపిణీ చేశాము. అన్నా క్యాంటీన్లో అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి అక్కడ భోజనం చేస్తున్న వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. చాలా మంది కార్మికులు మరియు ఇతర వర్గాల వారు అన్నా క్యాంటీన్ల వల్ల తక్కువ ఖర్చుతో మూడు పూటల ఆహారం లభిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన సందర్భంగా ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నా క్యాంటీన్ల కోసం ఎంతో కృషి చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని అన్నా క్యాంటీన్లకు రూ.76 లక్షల విరాళం అందజేయడం అభినందనీయం అన్నారు. పేద ప్రజలకు నామమాత్రపు రుసుముతో మూడు పూటలా భోజనం, టిఫిన్ అందిస్తున్న ఈ కార్యక్రమం నిజంగా ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కే. నూర్ మహమ్మద్, వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

### -బస్సు ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం అగ్ని మాపక కేంద్రం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వారోత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా సోమవారం అగ్ని మాపక కేంద్రం అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో బస్సుల్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ గ్యారేజ్ లో ఎయిర్ కండిషన్ బస్సులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ , ఇంజన్ ఓవర్ హిట్, డీజిల్ పెట్రోల్ లీకేజీ వల్ల అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా ఆర్పాలి అన్న విషయాలపై ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. అదే విధంగా మంటలు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు నివారించే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయా పరికరాలు ఏ విధంగా పనిచేస్తాయో అగ్నిమాపక సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమం డిపో మేనేజర్ ముని రామయ్య, సెక్యూరిటీ, మెకానిక్ సూపర్ వైజర్లు, మెకానిక్ లు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగించాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగించాలని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ సూచించారు. సోమవారం పాఠశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టుదలతో విద్యాభ్యాసం సాగిస్తే ఎంతటి ఉన్నత శిఖరాన్ని అయినా చేరుకోవచ్చన్నారు. విద్య నేర్చుకోవడం వల్ల సమాజంలో ప్రత్యేక గౌరవ మర్యాదలు ఉంటాయన్నారు. బాగా చదువుకుని అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఇందులో భాగంగా కొట్నూరు ఉన్నత పాఠశాలలో చదివి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ లో 470కి 460 మార్కులు పొందిన ఆనందరెడ్డి, నాగలక్ష్మి దంపతుల కుమార్తె చందనను ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, గంగప్ప, నరసింహమూర్తి, సిఆర్ఎంటి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## అంబికా ఫౌండేషన్ సహకారంతో వినికిడి యంత్రాలను పంపిణీ చేసిన ఎంపీ అంబికా



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అంబికా ఫౌండేషన్ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం ఓ ఎన్ జి సి సంస్థ సి ఎస్ ఆర్ నిధుల నుండి సుమారు రూ.30 లక్షల వ్యయంతో భారతీ సామాజిక్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి యంత్రాల పంపిణీ చేసిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అంబికా ఫౌండేషన్ చైర్మన్ అంబికా విక్షిత్ 280 మంది చెవిటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 130 మందికి ఆధునిక వినికిడి యంత్రాలను ఉచితంగా అందజేత ముఖ్య అతిథిగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు. సోమవారం అంబికా ఫౌండేషన్ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం నగరంలోని క్రొత్తవూరు వాసవీ కళ్యాణ మండపంలో ఉచిత వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం మన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణచే ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 280 మంది చెవిటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో అర్హత కలిగిన 130 మందికి ఆధునిక వినికిడి యంత్రాలను ఉచితంగా అందజేశారు. మిగిలిన వారందరికి మరో విడత వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న 10 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేసారు. ఈ వినికిడి యంత్రాల ద్వారా వారికి వినికిడి సామర్థ్యం మెరుగుపడి, వారి దైనందిన జీవితంలో సౌలభ్యం కలగనుంది. ఈ సందర్భంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు



ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఆయన పని చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా పేదలు, వృద్ధులు, వికలాంగులు, అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం చేరేలా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సేవే లక్ష్యంగా పనిచేస్తున్న నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా అంబికా ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ అధికారి శ్రీ ప్రశాంత్ శుక్లా, ఓఎన్‌జీసీ అధికారి అంకుష్ యాదవ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీ గోప మచ్చా నరసింహులు, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ టి. నరసింహులు, జీజీహెచ్ ఆడియాలజిస్ట్ శ్రీ కె. నరేంద్ర, జీజీహెచ్ ఆడియాలజిస్ట్ శ్రీమతి కృష్ణ వేణి, జీజీహెచ్ ఆడియాలజిస్ట్ శ్రీ పి. నాగిరెడ్డి, జీజీహెచ్ ఆడియాలజిస్ట్ శ్రీ గణేష్ రెడ్డి, అభయ ఆడియాలజిస్ట్ శ్రీమతి వై. సమీరా, డబ్ల్యూడీఏ టీజీ,ఎస్‌జీ అసిస్టెంట్ డైరెక్టర్, సెక్రటరీ నాగభూషణ, కార్యవర్గ సభ్యుడు సత్యారాం గారు, మనోజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మొహమ్మద్, ఓఎన్జిసి కంపెనీ ప్రతినిధులు, ఈఎన్ టి నిపుణులైన వైద్యులు మరియు సిబ్బంది, సాయినాథ్, అంబికా ఫౌండేషన్ వాలంటీర్లు, టీమ్ అంబికా సభ్యులు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచే ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం -పాంచజన్య శ్రీనివాసులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పాఠశాలలో విద్యనభ్యసించి, పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, ఇంటర్మీడియట్ చదువుల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిస్తే ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయాన్ని అందిస్తామని పాఠశాల అధ్యక్షులు బాధ్యత పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో ప్రతిభ కనబరచి, సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ కు చేరి ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో సువర్ణ భారతి జూనియర్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రిన్సిపాల్ నీలకంఠారెడ్డి, పరిపాలన అధికారి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పాంచజన్య పాఠశాలలో పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలను అందించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అడ్మిషన్ పొందారని తెలిపారు. అయితే వారందరూ పాఠశాల స్థాయిలో మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవడం, అదే క్రమశిక్షణతో కళాశాలలో విద్యను అభ్యసించి ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. అందుకోసం పాఠశాలలకు సైతం గుర్తింపు ఇవ్వాలన్న సంకల్పంతో ఆయా పాఠశాలల విద్యార్థులను వారి పాఠశాలల్లో అభినందన సభ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ, తమ పాఠశాలలో విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలు బోధించడంతోనే వారు ఏ కళాశాలలో చేరిన పాఠశాల స్థాయిలో ఏ విధంగా అయితే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. అదే ప్రతిభను ఉన్నత చదువుల్లో సైతం కనబరుస్తారన్నారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులందరికీ ఉన్నత చదువులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని, ఆ విద్యార్థులందరూ ఏ కళాశాలలో చదివిన రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిస్తే వారి ఉన్నత చదువులకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ షామీర్, చైతన్య, పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, ఏఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ గర్జన విజయవంతం చేద్దాం

### -గోడపత్రికలను విడుదల చేసిన దీపికా వేణురెడ్డి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కూటమి ప్రభుత్వం బీసీలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలపై 26వ తేదీన అనంతపురంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ గర్జన నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమాన్ని అందరూ ఐక్యంగా విజయవంతం చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీ గర్జన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అబద్ధాల మాటలతో బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బీసీలకు గతంలో ఇచ్చిన హామీలన్నీ పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో బీసీలందరికీ ఎనలేని ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. రాజకీయంగా 50% రిజర్వేషన్ కల్పించిన ఘనత ఒక జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్న విషయాన్ని తెలిపారు. బీసీలకు దక్కాల్సిన హక్కులను పొందేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని 26వ తేదీ బీసీగళం పేరుతో అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ లలిత కళాపరిషత్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీసీల హక్కుల సాధించుకోవడం కోసం ప్రతి ఒక్క వైసీపీ కార్యకర్త కూడా తరలి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ , మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు నాయకులు, వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేబీ శంకరయ్య

### -దీపికను సన్మానించిన ఎస్టీ నేతలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

వైకాపా రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా హిందూపురానికి చెందిన కేబి శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైకాపా బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వైకాపా సమన్వయకర్త దీపిక, నియోజకవర్గ వైకాపా నేత గుడ్డంపల్లి వేణురెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శంకరయ్య తో పాటు ఎస్టీ నాయకులు పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త దీపికా వేణు రెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి అనుబంధ విభాగాలఅధ్యక్షులు, నాయకులు వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా అమలు చేస్తాం --మైనర్ రైడింగ్ నియంత్రణకు ప్రత్యేకచర్యలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో రహదారి భద్రతా నియమాలను కఠినంగా అమలు చేస్తామని హిందూపురం డి.ఎస్.పి కెవి మహేష్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి డిఎస్పీ వివరాలను వెల్లడించారు. మోటార్ వాహన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే ఉండదన్నారు. నిబంధనల ప్రకారం మైనర్ డ్రైవింగ్ నేరమని, నిబంధనల అతిక్రమనకు పాల్పడితే జరిమానా విధించడంతోపాటు తల్లిదండ్రులకు జైలుశిక్ష విధించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, బైక్ స్టంట్ చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడపడం నేరమన్నారు. అలా మద్యం సేవించి వాహనాన్ని నడిపితే రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. మరోసారి పట్టుబడితే రూ.15 వేల వరకు జరిమాన విధించి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. హిందూపురం వ్యాప్తంగా సీసీ కెమెరాల ద్వారా 300లకు పైగా డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనాలను తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి వాహనాన్ని నడపాలన్నారు. వాహనాదారులందరూ నిబంధనను పాటించి ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో సహకరించాలని డిఎస్పీ కోరారు. ఈ సమావేశంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్, ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిక్సూచి నారా చంద్రబాబు నాయుడు


**తెదేపా మండల అధ్యక్షులుయనమలమదనమోహన్ లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి నాయక్ ఆధ్వర్యంలో**



ప్రజాభూమి బ్యూరో అన్నమయ్య

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిక్సూచి నారా చంద్రబాబు నాయుడు అని లక్కిరెడ్డిపల్లి మండల తెదేపా అధ్యక్షులు యనమల మదనమోహన్ లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ పేర్కొన్నారు లక్కిరెడ్డిపల్లి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు మండల తెదేపా అధ్యక్షులు యనమల మదనమోహన్ మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేసి తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ దేవ నాథ్ రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ సంకారపు జయరాం , గంగమ్మ దేవస్థానం చైర్మన్ సోడి వెంకటేశ్వర్లు ,మండ్ల రామాంజనేయులు, అన్వర్ ,మండల తెలుగు యువత అధ్యక్షులు కొలిమి పకీరయ్య మసూద్ తదితరులు పాల్గొన్నారు

## డ్రోన్ల సాయంతో కట్టుదిట్ట పర్యవేక్షణ సీఐ.టి. నరసింహులు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో బీడాలమిట్ట, శ్రీరామ్ నగర్, క్రిస్టియన్ కాలనీ, తువ్వపల్లి బ్రిడ్జి ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో కట్టుదిట్ట పర్యవేక్షణ, నిఘా చర్యలు చేపట్టినట్లు సీఐ టి. నరసింహులు తెలిపారు. డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో నిఘాను మరింత పెంచుతూ తనిఖీలు కట్టుదిట్టం చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానా స్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. పట్టణంలో శాంతి, భద్రతలను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యతగా సీఐ పేర్కొన్నారు.

## అసంపూర్తి పీహెచ్సీ భవనానికి నిధుల మంజూరు - ముదిగుబ్బ ప్రజలకు ఊరట



ప్రజాభూమి, ముదిగుబ్బ:

శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బలో సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) భవన నిర్మాణానికి చివరికి మోక్షం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవతో ఈ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.1.69 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దాదాపు పదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ పీహెచ్సీ నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. పలుమార్లు ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను సంప్రదించినా సమస్యకు పరిష్కారం దొరకలేదు.అయితే 2024 ఎన్నికల సమయంలో ముదిగుబ్బ పర్యటనకు వచ్చిన సత్యకుమార్ యాదవ్, ఈ సమస్యను స్వయంగా పరిశీలించి, తాను గెలిస్తే పీహెచ్సీ నిర్మాణాన్ని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ, ఎన్నికల అనంతరం వివిధ శాఖలతో నిరంతరం చర్చలు జరిపి అవసరమైన నిధులను సమకూర్చడంలో విజయం సాధించారు. ఈ మేరకు ఆరోగ్య ఀ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ 20 ఏప్రిల్ 2026 తేదీతో అధికారిక ఉత్తర్వులు జారీ చేస్తూ రూ.1.69 కోట్ల నిధులను విడుదల చేసినట్లు వెల్లడించారు. దీంతో మిగిలిన నిర్మాణ పనులు త్వరలోనే పునఃప్రారంభమై పూర్తి కానున్నాయి. పీహెచ్సీ భవనం పూర్తయితే ముదిగుబ్బతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. అత్యవసర చికిత్సలు, గర్భిణీ స్త్రీల సంరక్షణ, సాధారణ వైద్య సేవలు స్థానికంగానే లభించడం వల్ల ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగనుంది. ఈ నిర్ణయంపై ముదిగుబ్బ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని విస్మరించకుండా అమలు చేసినందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధి సాధ్యమని ఈ చర్య మరోసారి నిరూపించిందని బిజెపి నాయకులు అభిప్రాయపడుతున్నారు.

